## తిమ్మప్పస్వామిసేవలో అదనపు కలెక్టర్



మల్దకల్‌లో స్వామి వారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ బృందం

మల్దకల్, జూన్ 23 : ఆదిశిలా క్షేత్రంలో స్వయంభువుగా వెలిసిన తిమ్మప్పస్వామిని ఆదివారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులతో కలిసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు ఆయన్ను శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## నెట్టెంపాడు లిఫ్ట్‌కు నీటి తరలింపు



గుడ్డెందొడ్డి లిఫ్ట్ వద్ద నీటి విడుదల చేస్తున్న దృశ్యం

ధరూరు, జూన్ 23 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి నీటి తరలింపు కొనసాగుతున్నది. 750క్యూసెక్కుల నీటిని రోజువారీగా తరలిస్తున్నారు. దీంతో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నీటితో కళకళలాడుతున్నది. మండలంలోని దక్షిణ ప్రాంత రైతులు సాగునీరు వస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

## కాల్వలో ముళ్లపొదలు తొలగింపు



భూత్పూర్ కాల్వలో జేసీబీ సాయంతో ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

అమరచింత, జూన్ 23 : మండలంలోని పాంరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న భూత్పూర్ కాల్వ నుంచి పాంరెడ్డిపల్లి, అమరచింత, పిన్నంచర్ల, చంద్రనాయక్‌తండాతోపాటు వివిధ గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు అందుతుంది. కాల్వలో ముళ్లపొదలు నిండిపోయి సాగునీటి సరఫరాకు ఆటంకంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పట్టణవాసి, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి తన సొంత నిధులతో కాల్వలో పెరిగిన ముళ్ల పొదలను జేసీబీతో తీయించారు. దీంతో ఆయా గ్రామాల రైతులకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం



చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

వనపర్తి టౌన్, జూన్ 23 : వనపర్తి అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న రైతుల భూములను ఆయన పరిశీలించారు. నాగవరం శివారులోని సర్వే నెంబర్ 200, 86లో తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్న రైతుల భూముల్లో మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ఇతర అభివృద్ధి అవసరాల కోసం భూములు ఇచ్చారని, వారికి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఎకరాకు రూ.5లక్షల చొప్పున పట్టాల రూపంలో ఇచ్చినా ఎన్‌వోసీ మంజూరు చేయలేదని చిన్నారెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించి కలెక్టర్‌కు లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు పంపారు. తక్షణమే రైతుల సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రైతులు చంద్రూనాయక్, సూర్యానాయక్, వస్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రతిభా పోలీసులకు సేవా పతకాలు

గద్వాల అర్బన్, జూన్ 23: జిల్లాలో 2024 సంవత్సరానికి సంబంధించి పోలీస్ శాఖలోని వివిధ పోలీస్ విభాగాల్లో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి డీజీపీ సేవా పతకాలను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా నుంచి సేవా పతకాలకు ఎంపికైన అధికారులు ఏఎస్సై ఈశ్వరయ్య(మల్దకల్), ఏఆర్ ఎస్సై రాజశేఖర్( సాయుధ దళ కార్యాలయం, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు(అలంపూర్), హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి(మనవపాడు), హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్(స్పెషల్ బ్రాంచ్), ఏఆర్ హెచ్‌సీ ఎల్లశివాచారి(సాయుధ దళ కార్యాలయం), హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు(సీసీఎస్) తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు ఎంపికైన వారిని అభినందించి, ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించి వీరిలాగానే ఉత్తమ సేవా పతకాలను పొందాలని ఆకాంక్షించారు.

# చెత్త సేకరణ పట్టదా..?

- డంప్‌యార్డులుగా మారుతున్న ఖాళీ జాగాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

గద్వాలటౌన్, జూన్ 23 : గద్వాల పట్టణంలో పారిశుధ్య సమస్య జఠిలంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని 37వార్డుల్లో చెత్త సేకరణ బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తూ గత అక్టోబర్‌లో కౌన్సిల్ తీర్మానించింది. అయితే చెత్త బాధ్యతలు తీసుకున్న ఏజెన్సీ అనుకున్న మేరలో చెత్త సేకరణను చేపట్టలేక పోయింది. పట్టణంలో వార్డుల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. స్పందించిన మున్సిపల్ చైర్మన్ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రైవేట్ ఏజెన్సీకి చెత్త సేకరణ బాధ్యతలు రద్దు చేయించారు. యథావిధిగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే చెత్త సేకరణ చేపడతామని తెలిపారు. కానీ అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వార్డుల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ప్రధాన రోడ్లతో పాటు వార్డుల్లో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. కాలనీల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. చెత్త కుండీలు లేక, చెత్త సేకరించే వాహనాలు రాకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే చెత్తను పారవేస్తున్నారు. దీంతో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. ఈ పేరుకుపోయిన చెత్తతో కాలనీలు కంపు కొడుతున్నాయి. అంతేకాకుండా వర్షాకాలం కావడంతో చెత్తాచెదారం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గద్వాల పట్టణంలోని గంటవీధిలో రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

గట్టు, జూన్ 23 : అయిజ–మిట్టదొడ్డి 33కేవీ మిట్టదొడ్డి ఫీడర్‌పై ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్నందున సోమవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని ఏడీఈ గోవిందు, గట్టు ఏఈ చిన్నయ్య ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్న కారణంగా మాచర్ల, బలిగేర, కొత్తపల్లి, చమన్‌ఖాన్‌దొడ్డి, కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని సోంపురం, అప్పనకొండహళ్లి, చింతలకుంట గ్రామాల్లో మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

## పాముకాటుతో బాలుడు మృతి

మానవపాడు, జూన్ 23: ఇటీవల పాముకాటుకు గురైన బాలుడు మృతి చెందినట్లు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. వివరాలిలా.. ఈనెల 19న మండలంలోని పెద్ద ఆందాల పాడుకు చెందిన సుంకన్న భార్య, కుమారుడు ఉదయ్ తో(4)తో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు మానవపాడు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని కర్నూలు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలి



మాట్లాడుతున్న కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్

వనపర్తి టౌన్, జూన్ 23 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంను, నీట్ పరీక్షను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నీట్ పరీక్షను 24లక్షల మంది విద్యార్థులు రాశారని, బీజేపీ పాలిత రాష్ట్రాలైన బీహర్, హర్యాన, గుజరాత్‌లో పేపర్ లీకైందని, ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30లక్షలు తీసుకొని పరీక్ష పేపర్‌ను అమ్ముకున్నారని ఈ విషయంలో ప్రధాని మోదీ నోరు మెదపడం లేదని ఆరోపించారు. పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు తీసుకొని విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరణ చేస్తూ సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నారని, సింగరేణిని ప్రైవేటీకరించబోమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బొగ్గుగనుల వేలంను రద్దు చేసి సింగరేణికి బొగ్గు కేటాయింపు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ జబ్బార్, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో నెమలి మృతి

మానవపాడు, జూన్ 23: ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చిన జాతీయ పక్షి నెమలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆదివారం ఉదయం మానవపాడులో పంట పొలాల పక్కనే ఉన్న ఎస్సీకాలనీలో వచ్చిన నెమలి విద్యుదాఘాతానికి గురై పడిపోయింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సహకారంతో స్థానిక పశువైద్యశాలకు తరలించారు. పరిశీలించిన సిబ్బంది నెమలి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహిస్తామని సిబ్బంది తెలిపారు.



నెమలిని పోస్టుమార్టంకు తరలిస్తున్న అధికారులు

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు, జూన్ 23 : ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ డిమాండ్ చేశారు. స్థానిక సర్కారు దవాఖానలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, భద్రత, పేషంట్‌కేర్, సూపర్‌వైజర్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ నేతృత్వంలో సర్కారు దవాఖాన ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటయ్య ఏజెన్సీ కాంట్రాక్టర్ అయినప్పటి నుంచి కార్మికులకు ఎన్నడూ మొత్తం వేతనాలు చెల్లించలేదని విమర్శించారు. గతంలో జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఒకటి, రెండు నెలల వేతనాలు అందించినట్లు, రెండు సంవత్సరాలుగా కార్మికులు వేతనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిమెంట్ ప్రకారం ప్రతినెలా బడ్జెట్ రాకపోయినా ఏజెన్సీ నుంచి వేతనాలు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో మెరుపు సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారి వంశీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సత్తార్, బాలరాజు, మోహియొద్దీన్, పార్వతమ్మ, చెన్నమ్మ, నాగమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

## సింగిల్ విండో కార్యాలయానికి స్థలం కేటాయించాలి

వనపర్తి, జూన్ 23 : వనపర్తి నియోజకవర్గంలోని రాజనగరం సింగిల్ విండో కార్యాలయానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డికి ఆదివారం చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజనగరం సింగిల్ విండో డైరెక్టర్లు చిన్నారెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వినతిపత్రంలో సింగిల్ విండో ద్వారా ధాన్యం కొనుగోలు, గోడౌన్ నిర్మాణం కోసం రాజపేట పరిధిలో ఐదెకరాల స్థలాన్ని సంఘానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాలచంద్రయ్య, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నారెడిని సన్మానిస్తున్న పీఏసీసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు

# గ్రామీణ క్రీడలను కాపాడుకుందాం

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి

గద్వాల, జూన్ 23 : కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి అన్నారు. ఏరువాక పండుగను పురస్కరించుకొని గద్వాల మండలంలోని మర్లపల్లి గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాముడు, మద్దిలేటి, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న గడ్డం కృష్ణారెడ్డి

# జోరుగా ఇసుక దందా

పాన్‌గల్, జూన్ 23 : మండలంలోని గోప్లాపూర్, చిక్కేపల్లి, దావాజీపల్లి, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ఆన్‌లైన్ ద్వారా అవసరం ఉన్న వారికి సరఫరా చేస్తుండగా ఇవేవి కాదనన్నట్లు ఇసుకాసురులు తమ ఇష్టానుసారంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తూ కాసులు కురిపిస్తున్నారు. ఎంజీకేఎల్ఐ, భీమా కాలువలనుంచి నీటి ప్రవాహానికి గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో ఇసుక తెన్నులు ఏర్పడ్డాయి. అదేవిధంగా వర్షాలకు వాగులు వంకల్లో ఇసుక తెన్నులు, మట్టి దిబ్బలు మారాయి. క్రమేణా చెరువులు, కుంటలు, వాగుల్లో నీరంతా పొలాలకు తరలించడంతో ఇసుక తరలించే వారి కన్ను మళ్లీ ఇసుక తెన్నులు, మట్టి దిబ్బలపై పడింది. దీంతో ఆయా గ్రామాల్లోని కుంటలు, చెరువులు, వాగులు, వంకల్లో ఉన్న ఇసుకను పోటాపోటీగా తోడేసుకుంటున్నారు. ఇసుకను ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు చేరవేసుకుంటూ భారీగా డంపులు చేసుకుంటున్నారు. మండలంలోని గోప్లాపూర్, చిక్కేపల్లి, తెల్లరాళ్లపల్లి, దవాజీపల్లి, రాయినిపల్లి గ్రామాల సమీపాల్లో ఇసుకను భారీగా డంప్ చేసి రాసులు పోసుకొని రాత్రి వేళలో వనపర్తి, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ఇసుక అక్రమ రవాణా చేసే వారికి వర్తించదా అంటూ అధికారుల తీరును ఎద్దేవా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై తాసీల్దార్‌ను వివరణ కోరగా ఇసుక రవాణాపై ఎవరికీ అనుమతులు లేవని తెలిపారు.



గోప్లాపూర్ గ్రామంలో నిల్వ చేసుకున్న ఇసుక డంపులు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

చిన్నంబావి, జూన్ 23 : హైదరాబాద్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొని చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శివశంకర్‌నాయుడు (28) హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ ప్రాంతంలో బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శివశంకర్‌నాయుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నీలహళ్లిలో రైతు సంబురాలు



నీలహళ్లిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మీర్జాపురం రంగారెడ్డి

ధరూరు, జూన్ 23 : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని నీలహళ్లి గ్రామంలో ఆదివారం రైతులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు, ట్రాక్టర్ పోటీలు గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించగా వీటిని మీర్జాపురం రంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోయ సరోజాఈరన్న, మాజీ ఉపసర్పంచ్ సొంటి రంగస్వామి, బోయ చిన్నహనుమంతు, చిలుక మునెప్ప, నర్సింహులు, బోగాని ఈరన్న, రాంబాబు, వినోద్, పిల్లిజుట్టు లాలప్ప, సవరప్ప, శివకోటి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కళలకు పుట్టినిల్లు అమరచింత

అమరచింత, జూన్ 23 : కళారంగంలో ఉన్న 64కళలకు అమరచింత పుట్టినిల్లుగా వెలుగుతుందని, ఎవరికి ఆసక్తి కలిగిన రంగంలో వారు పనిచేస్తూ అమరచింతకు జాతీయస్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, డ్యాన్స్ మాస్టర్లు బాలరాజు, ఈటె వెంకటేశ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి జెడ్పీ పాఠశాల ఆవరణలో ప్రత్యూష డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ పోటీల్లో పాల్గొని మాట్లాడారు. కళారంగంలో దివంగత కళాకారుడు సాయిచంద్ జాతీయ స్థాయిలో అమరచింతకు పేరు తీసుకురాగా, ఇప్పుడు డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్ రాష్ట్ర స్థాయిలో ఇక్కడ డ్యాన్స్ పోటీలను నిర్వహించి ఉమ్మడి రాష్ట్రంలో పేరు తీసుకువాచ్చడని, ఇంకా ప్రతిభ కలిగిన కళాకారులు అమరచింతలో ఎంతో మంది ఉన్నారని వారంతా తమ ప్రతిభను చాటి అమరచింత మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమం లో అమరచింత ఎస్సై సురేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, డ్యాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.

## సమాజ సేవకు అంకితమవ్వాలి



ప్రకాశ్‌రావు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 23 : ఉద్యోగ విరమణ తర్వాత ఉద్యోగులు సమాజ సేవకు అంకితం కావాలని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. గంగారం హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జంగిడిపురం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకాశ్‌రావు దంపతులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నారాయణరెడ్డి, విజయ్‌కుమార్, రాంరెడ్డి, వరప్రసాదరావు, మద్దిలేటి, రఘువర్ధన్‌రెడ్డి, హేమలత, మాధవి, జగపతిరావు, కృష్ణారెడ్డి, వినోద్, జయలక్ష్మి, మధుసూదన్, గంధం నాగరాజు ఉన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

గట్టు, జూన్ 23 : మండలంలోని తారాపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా సందెరాళ్ల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ఎనుముల రవి ప్రథమస్థానంలో, వీరేశ్ రెండో స్థానంలో, బాలు మూడో స్థానంలో నిలిచి విజేతలుగా నిలిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.2,016, రూ.1,500, రూ.1000 దాతలు మల్లికార్జున్‌గౌడ్, రమేశ్, రవిగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు ప్రదానం చేస్తున్న గ్రామస్తులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఉద్యోగ అవకాశం**

★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

అమరచింత, జూన్ 23 : జన్‌సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను (బాలిదాన్ దివాసును)ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర నాయకులు మేర్వరాజు, పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***మదనాపురం మండలంలో..***

మదనాపురం, జూన్ 23 : మండలకేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు వెంకటేశ్, రాజశేఖర్, రవి, కృష్ణ,చ అమర్‌నాథ్, నితిన్‌కుమార్, నాగరాజు, రాము, భాస్కర్ తదితరులు ఉన్నారు.

***గోపాల్‌పేట మండలంలో..***

గోపాల్‌పేట, జూన్ 23 : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అరుణ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నారాయణ, నాయకులు శివ, ఆంజనేయులు, రాజేశ్, రాఘవేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గోపాల్‌పేటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు